కథ

# దిద్దుబాటు

పులిపాక కనకదుర్గ

కాలం ఘనీభవించినట్టుగా అనిపించింది సిరి చందనకు.

రాత్రి పదకొండు అయినట్టుగా గడియారం నిర్విరామంగా పదకొండు గంటలు కొట్టింది.

ఎనిమిది అయినప్పటి నుంచి భర్త కోసం ఎదురుచూస్తూనే ఉంది.

క్షణమొక యుగంలా గడిచింది కానీ విష్ణు జాడ లేదు.

ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది.

ఆ నిశ్శబ్దం భయంకరంగా తోచి విష్ణుకు ఫోన్ చేద్దామనుకుని, అంతలోనే ఆ ప్రయత్నాన్ని విరమించుకుంది.

"ఏమ్మా! అబ్బాయింకా రాలేదా?"

ఉలిక్కిపడి వెనక్కు చూసింది సిరి.

అత్తగారు.

"మీరా?" తొట్రుపాటుతో నిలబడింది.

"వచ్చి నాలుగు రోజులయ్యింది. అప్పటి నుంచి నేను గమనిస్తూనే ఉన్నాను. ఏ రోజూ పదకొండు దాటందే ఇంటికి రావటం లేదు. ఎందుచేత? పని ఒత్తిడి వల్లా?" మామూలుగానే అడిగింది ఆవిడ.

కొద్దిక్షణాలు ఏం చెప్పాలో తోచలేదు.

తరువాత ఆవిడ అడిగిన ప్రశ్నలోనే సమాధానం స్ఫురించి "పని ఒత్తిడి వల్లే అనుకుంటాను" అని చెప్పింది.

సిరిలో తడబాటుని ఆవిడ గుర్తించకపోలేదు.

అత్తగారు వెళ్లిపోయేక గుండె దడ తగ్గినట్టనిపించింది. ఆవిడ వాలకం చూస్తూంటే అక్కడితో ఆ విషయాన్ని వదిలేలా లేదని అనిపించింది సిరిచందనకు.

ఎందుకో ఇల్లంతా బావురుమన్నట్టుగా అనిపించింది.

'నేస్తమా? నేనున్నానంటూ' ఓ కన్నీటి చుక్క చెంపను తడిమింది.

మరో పావుగంటకు విష్ణు వచ్చేడు.

ఎందుకు ఆలస్యం అయ్యిందని అడగాలనుకుంది. కానీ అతని గాంభీర్యం చూసి మౌనంగా ఉండిపోయింది.

భోజనం వడ్డించబోతే వద్దని వారించేడు విష్ణు.

బయటే ఎక్కడో భోజనం చేసి ఉంటాడని అర్థమయ్యింది. తనిక్కడ అతని కోసం భోజనం చేయకుండా ఎదురుచూస్తుందని తెలిసి కూడా అతనిలా ఏమీ పట్టనట్టు ఉన్నందుకు మనసు చివుక్కుమంది.

కాసిని మంచినీళ్లు తాగి, లైట్లు తీసి వచ్చేసరికి అతను గాఢనిద్రలో ఉన్నాడు.

పక్క గదిలో అత్తగారి పక్కన నిద్రపోతున్న పిల్లల్ని చూసి, ఓ మారు దుప్పట్లు సరిచేసి తమ గదిలోకి వచ్చింది సిరి. పొంగుకొస్తున్న దుఃఖాన్ని అదిమిపెట్టి, అతనికి కాస్త దూరంగా పడుకుంది.

చేరువలో భర్త.

కానీ ఇద్దరి మధ్యా ఏదో అఘాతం ఉన్నట్టుగా భావన.

తమ మధ్యన ఏర్పడ్డ దూరం రోజురోజుకు పెరిగిపోతున్నట్టుగా తెలిసిపోతూనే ఉంది. కానీ దానికి కారణాలు తెలియటం లేదు. ఆ దూరాన్ని తగ్గించే మార్గం తెలియటం లేదు. భర్తనే నేరుగా అడిగెయ్యాలంటే ఏదో సంకోచం.

తనతో అంటీముట్టనట్టుగా ఉంటున్న అతని ప్రవర్తన అల్లంత దూరంలోనే ఉంచుతోంది.

అసలు తను ఏం తప్పు చేసిందో ఆమెకు తెలియటం లేదు.

విష్ణు చాలా మారిపోయాడన్నది మటుకు నిజం.

మొన్నమొన్నటి వరకూ అంటే సంవత్సరం క్రితం సాయంత్రం ఆరయ్యేసరికి ఇంట్లో ఉండేవాడు.

వృత్తి ఎంత ముఖ్యమో, వ్యక్తిగత జీవితం కూడా అంతే ముఖ్యమని నమ్మేవాడు. అందుకే ఆఫీసులో ఎంత బిజీవర్కు ఉన్నా, సాయంత్రమయ్యేసరికి తమ మధ్యన ఉండేవాడు. అసలా మాటకొస్తే తమది సొంత ఫర్మ్. అయినా విష్ణు ఖచ్చితమైన టైమింగ్స్ పాటించేవాడు.

అయితే ఇప్పుడు అదంతా గతం!

ఇప్పుడు విష్ణు ఎప్పుడు ఇంటికి వస్తాడో, ఎప్పుడు బయటకు వెళ్తాడో ఇంట్లో ఎవరికీ తెలియదు.

ఒకప్పుడు సరదాగా సందడి చేసే భర్త ఇప్పుడు ఎందుకో ముభావంగా ఉంటున్నాడు.

పలకరిస్తే ముక్తసరిగా రెండుముక్కలు మాట్లాడ్తాడు.

తెలియకుండానే ఆలుమగల మధ్య దూరం పెరిగిపోయింది.

అందుకు భర్తని నిలదియ్యాలంటే తెలియని జంకు కలుగుతోంది. తమ మధ్యన దూరం జంకు లాంటివి ఉండటం సిరికి ఇప్పుడిప్పుడే చిత్రంగా అనిపిస్తోంది.

'వేరొక స్త్రీ పరిచయం ఇందుకు కారణం కాదు కదా!' అన్న అనుమానం సిరి మనసులో కలగకపోలేదు. పెళ్లయిన ఏడేళ్ల వరకూ పిల్లలు కలగకపోయినా ఏనాడూ తనను నొప్పించని భర్త హృదయ వైశాల్యం ఆమెకు సుపరిచితమే. అందుకు, ఆ అనుమానాన్ని మొగ్గలోనే తుంచేసింది.

పరిపరి విధాల ఆలోచనలతో సతమతమవుతున్న ఆమెకు ఎప్పటికో మాగన్నుగా నిద్రపట్టింది.

మర్నాడు ఉదయం బ్రేక్‌ఫాస్ట్ కూడా చేయకుండా హడావిడిగా వెళ్లిపోతున్న విష్ణును చిత్తరువులా గమనించటం మినహా ఏమీ చేయలేకపోయింది సిరి.

"వెళ్లిపోయిన వాడిని ఎంతసేపలా చూస్తుండిపోతావు? పిల్లలు ఏడుస్తున్నారు. కాస్త వాళ్ల సంగతి చూడు" అత్తగారి పిలుపుతో చప్పున పిల్లల దగ్గరకు వెళ్లింది.

సిరికి ఇద్దరూ మగపిల్లలే. కవలలు.

పది నెలల వయసున్న పసిపిల్లలను సముదాయించేసరికి నిస్త్రాణం ముంచుకొచ్చింది సిరికి.

పిల్లల ఆలనా పాలనా అంతా ఆమెదే.

పిల్లల విషయానికొచ్చేసరికి మొక్కుబడిగా వ్యవహరిస్తాడు విష్ణు.

మొన్నటి మొన్న పోలియో చుక్కలు కూడా తనే దగ్గరుండి వేయించింది సిరి. తనను నిర్లక్ష్యం చేస్తున్నా భరించిందిగానీ, పిల్లలను కూడా ప్రేమగా చూడకుండా ఉంటున్న విష్ణు నిర్లిప్తత కష్టాన్ని కలిగించింది సిరి మనసుకు.

కనీసం అత్తగారు వచ్చినప్పుడయినా పద్ధతి మార్చుకోని భర్త ప్రవర్తన ఇంకా కష్టంగా తోచింది.

అత్తగారంటే మనసు మూలల్లో విపరీతమైన వెరపు సిరికి. పెళ్లయిన చాలా కాలం వరకూ పిల్లలు కలగకపోవడంతో విష్ణుకు తనను దూరం చేసి మరో మనవు చేయాలని ఎన్నో ప్రయత్నాలు చేసింది.

విష్ణు దేవుడిలాంటి వాడు కాబట్టే తన కాపురం చెదిరిపోలేదు.

పెళ్లయిన ఇన్నేళ్లల్లో ఒక్కసారి కూడా తనను నొప్పించలేదు భర్త. అంతటి ఉత్తముడైన భర్తకు భాగస్వామిని చేసినందుకు భగవంతుడికి సదా కృతజ్ఞతలు తెలుపుకుంటూనే ఉంది.

అలాంటి భర్త ఉన్నట్టుండి మారిపోయాడు.

ఇంట్లో పనివాళ్లు ఉన్నా, తనకు అన్ని పనుల్లో చేదోడు వాదోడుగా ఉండే భర్త ఇప్పుడు పిల్లల ఆలనాపాలనలో చిన్నమెత్తు భాగం కూడా తీసుకోవటంలేదు.

అత్తగారు వచ్చి పిల్లలను చూసుకోవటంతో తను వంటపని మొదలుపెట్టింది సిరి.

వంటంతా పూర్తి చేసి డైనింగ్ టేబుల్ మీద సర్దింది.

అత్తగారిని భోజనానికి రమ్మంటే విష్ణు వచ్చేక చేద్దామంది ఆవిడ.

రెండు దాటినా రాలేదు విష్ణు.

సెల్‌కు ఫోన్ చేస్తే "బిజీగా ఉన్నాను. మీరు కానియ్యండని" సమాధానం.

"ఆ మాట ముందే ఫోన్ చేసి చెప్పొచ్చుగా" అసహనంగా అంది అత్తగారు.

ఏ సమాధానం చెప్తే ఎటొస్తుందోనని మౌనంగా ఉండిపోయింది సిరి.

"ఎందుకలా మారిపోయాడు విష్ణు?" తనలో తను అనుకున్నట్టుగా అందావిడ.

"నాకేదో అనుమానంగా ఉందమ్మాయ్!" ఈసారి డైరెక్టుగా అనేసింది.

"అదేమిటండీ! అలా అంటారు?" భయంగా అంది సిరి.

"అవునమ్మా, విష్ణు ఎప్పుడూ ఇలా ప్రవర్తించలేదు. భోజనానికి ఎంత దూరంలో ఉన్నా, వీలు చేసుకుని వస్తాడు. తప్పనిసరిగా బయట భోజనం చేయాల్సి వస్తే ముందే ఫోన్ చేస్తాడు. అంతేగానీ, ఇలా ఏం పట్టనట్టుగా ఉండడు. లేక లేక పుట్టిన పిల్లలదగ్గర అయిదు నిమిషాలు కూడా గడపటం లేదు" ఏదో ఆలోచిస్తున్నట్టుగా అన్నది అత్తగారు.

ఆవిడ మాటలకు తనను తాము ఓసారి పరిశీలనగా చూసుకుంది సిరి.

"కవలలు కావటంతో పిల్లలు పుట్టిన తరువాత లావణ్యం తగ్గిన మాట వాస్తవం. కానీ, దానికే విష్ణు తనను ఇంత నిర్లక్ష్యం చెయ్యాలా?"

సిరి ఆలోచనలు చదివినట్టుగా అంది అత్తగారు 'విష్ణుది చాలా సున్నితమైన మనసు. ప్రేమించటం మాత్రమే వాడికి తెలుసు."

"మరి అలాటప్పుడు ఎందుకింతలా మారిపోవటం?" ఏడుపుగొంతుతో అంది సిరి.

"ఎక్కడో తప్పు మన వల్లే జరిగి ఉంటుంది." సాలోచనగా అందావిడ.

"నేనలా అనుకోవటం లేదు. ఆయనకు నా మీద ఇష్టం తగ్గిపోయింది. నాకు తెలిసి ఆయన పట్ల చిన్న పొరపాటు కూడా చెయ్యలేదు." దుఃఖాన్ని దిగమింగుకుంటూ అంది సిరి.

అమాయకురాలిని చూసినట్టుగా చూసింది సిరిని ఆవిడ.

"ఇన్నేళ్లుగా విష్ణుతో కాపురం చేస్తున్నావు. ఇంతేనా నువ్వు భర్తని అర్థం చేసుకుంది?" అన్న భావం స్ఫురించింది అత్తగారి చూపులో సిరికి.

విష్ణు మంచితనం తెలిసి కూడా అతన్ని అనుమానించటానికి మనస్కరించటం లేదు సిరికి.

కానీ, తెలియని ఉక్రోషం ఆమెని చుట్టుముట్టింది.

అందుకే, విష్ణు రాగానే వాదన చేసుకుంది.


"నీకిప్పుడు ఏం తక్కువయ్యిందని అంత రభస చేస్తున్నావు?" శాంతంగా అన్నాడు విష్ణు.

"ఇంకా ఏం తక్కువ కావాలి? నన్ను, పిల్లల్ని అసలు పట్టించుకుంటున్నారా?

అసలు మేమంటూ ఉన్నామన్న విషయం కూడా మీకు గుర్తున్నట్టు లేదు."

"ఇంటి నిండా పనివాళ్లున్నారు. నీకంటూ పిల్లలు

న్నారు. కాలం కదిపితే కారం



సిద్ధంగా ఉంటుంది. చేతి నిండా డబ్బుంది. ఇంకా, ఏం కావాలి?"

"ఎన్ని ఉన్నా మీకంటే ఎక్కువ కావు. మీ కంటే అన్నీ తక్కువే. మీరిలా ఉంటే నేను భరించలేను." కన్నీళ్లతో అంది సిరి.

"ఇన్ని ఉన్నా ఇంకా నీకు ప్రేమ కావల్సి వచ్చింది.

మరి ఎవరూ లేని, అశుభం శుభం తెలియని ఓ పసి మనసుకు ప్రేమ అక్కర్లేదా?" తీవ్రంగా అన్నాడు విష్ణు.

భర్త ఉదాసీనతకు కారణం తెలిసీతెలియనట్టుగా అనిపించింది సిరికి.

కన్న పేగు కదిలినట్టయ్యింది.

ప్రేమ కోసం ఓ పసి మనసు ఆరాటం అర్థమయ్యింది.

హృదయం కెలికినట్టయ్యింది.

ప్రియ గుర్తుకొచ్చి కళ్ల కన్నీటి చెలమలయ్యాయి.

అప్పుడే ఆ గదిలోకి అడుగు పెట్టిన అత్తగారు అంది "అవును సిరీ. నేను అనుకున్నదే నిజం. ప్రియను వాడికి దూరం చేసినప్పటి నుంచే వాడిలా తయారయ్యాడు."

ఆ మాటల్లో ఎంతో నిజముందని తెలుసు సిరికి.

"ప్రియంటే విష్ణుకు ప్రాణం. ఆ సంగతి తెలిసి కూడా ఆ పిల్లను వారికి దూరం చేశాము. ఆ పాపంలో నాక్కూడా భాగముంది" దిగులుగా అంది అత్తగారు.

అత్తగారి నోటి వెంట ప్రియ ప్రస్తావన రాగానే సిరి మొహం కళ తప్పింది.

ఓ చిన్నారి స్వరం "అమ్మా! అమ్మా!" అంటూ ఆర్తనాదం చేస్తున్నట్టుగా అనిపించింది.

"నిజమే! ఇన్ని హంగులున్న తనకే, ఈ వయసులో భర్త ప్రేమ కాస్త తగ్గినందుకే ఇంత దుర్భరంగా అనిపిస్తే, అమ్మ ప్రేమ పూర్తిగా కరువయినందుకు ప్రియ చిన్నారి హృదయం ఎంతగా పరితపించి ఉంటుంది!"

పెళ్లయిన అయిదేళ్లకు కూడా సంతానం కలుగలేదు విష్ణు, సిరిలకు.

ఎప్పుడూ దిగాలుగా ఉండే సిరిని చూస్తుంటే విష్ణు హృదయం ద్రవించిపోయేది.

"పిల్లలు ఈరోజు కాకపోతే రేపు పుడతారు. మనకేమంత వయసయిపోయింది చెప్పు" అనునయంగా అన్నాడు.

"నాకు ఆ నమ్మకం పూర్తిగా సన్నగిల్లిపోయింది. ఎన్నో పూజలు, వ్రతాలు చేశాను. అయినా భగవంతుడికి నా మీద దయ కలుగలేదు. ఇక, ఈ జీవితం ఇంతే!" నిస్పృహగా అంది సిరి.

"పోనీ, అలాగే అనుకో. ఇప్పుడు మనకొచ్చిన లోటేమిటి?"

భర్త లాలనకు సిరి హృదయవేదన ఎక్కువయ్యింది.

"పసిపాప పారాడని వట్టిల్లు ఇల్లేనా? ఇంటికి ఎవరొచ్చినా, మనం ఎక్కడకి వెళ్లినా, అందరూ అడిగే ప్రశ్న పిల్లలెంతమందనే. అయినా మీ అమ్మగారు ఎలానూ గమ్మునుండరు. మిమ్మల్ని నాకు దూరం చేసి మీకు మరో పెళ్లి చేస్తారు."

సిరి కన్నీళ్లను చూసి చలించిపోయాడు విష్ణు.

ఆమె వేదన అర్థమయ్యింది.

భయం తెలిసింది.

అందుకే తనకు తానుగా ఓ నిర్ణయం తీసుకున్నాడు.

అలా తమ దగ్గరకు వచ్చిన పసికందు ప్రియ. నెలల పిల్లగా ఉండగానే పాపను అనాథ శరణాలయం నుంచి తెచ్చుకున్నారు.

ప్రియ రాక అన్ని సమస్యలకు పరిష్కారమయ్యింది.

"అమ్మా!" అన్న పిలుపునకు నోచుకోని తనను అమ్మను చేసింది ప్రియ. అత్తగారికి విష్ణు నిర్ణయం అర్థమయ్యి అంతటితో ఆగిపోయింది. తన కాపురం ఎన్నటికి చెదిరిపోదన్న ధీమా కలిగింది సిరిలో. అలా అన్ని ప్రశ్నలకు సమాధానమయ్యింది ప్రియ.

ప్రియ తన వెంట అమితమైన ఆనందాన్ని కూడా వెంట తెచ్చింది.

విష్ణుకయితే ప్రియంటే ప్రాణం!

రెండు సంవత్సరాలు రెండు క్షణాల్లా గడిచిపోయాయి.

అప్పుడే తెలిసింది సిరి తల్లి కాబోతోందన్న శుభవార్త!


అప్పటి నుంచి మొదలయ్యాయి చిన్నారి ప్రియకు కష్టాలు. అంతదాకా మౌనంగా ఉండిపోయిన విష్ణు తల్లి తిరిగి రంగప్రవేశం చేసింది. ప్రియను తిరిగి శరణాలయానికి పంపెయ్యమని సిరికి నూరిపోసింది. సిరికి కూడా లోపల అదే ఆలోచన ఉన్నట్టుంది. అత్తగారి ప్రతిపాదన ఆమెకు సవ్యంగానే తోచింది.

విష్ణుకు నచ్చచెప్పే భారం అత్తగారు తన మీద వేసుకుంది.

ప్రియను పంపించటానికి విష్ణు అస్సలు అంగీకరించలేదు.

"ప్రియ మన కడుపున పుట్టిన పిల్లే అయితే ఇలాగే ఉండేవాళ్లమా? మనలని మొదటిసారి తల్లిదండ్రులను చేసిన బంగారు తల్లిని నేను వదులుకోను. అయినా, ఇంత సంపద ఉంది, ఓ పసిది మనకు భారమా?" అని కూడా అన్నాడు.

"కన్నప్రేమను మించినది పెంచిన ప్రేమ అంటారు. అదెందుకు నీ విషయంలో అబద్ధమయ్యింది?" సిరిని ప్రశ్నించేడు ఓసారి విష్ణు.




"కంటేనే అమ్మ అంటే ఎలా సిరీ?" మరొకసారి అడిగేడు విష్ణు.

అన్నింటికీ ఒకటే సమాధానం. ప్రియను పంపెయ్యమని. కులగోత్రాలు తెలియని పిల్ల ఆ ఇంట ఉండరాదని.

"తమకు పిల్లలు కలగనప్పుడు అవసరం లేని కులగోత్రాలు ఇప్పుడు కావల్సి వచ్చాయా" అని నొచ్చుకున్నాడు విష్ణు.

సిరి నిరాదరణ కారణంగా చిక్కి సగమయ్యింది ప్రియ.

ఎన్ని చెప్పినా సిరి మనసు మారదని గ్రహించిన విష్ణు- ప్రియను ఆ ఇంటి నుంచి తీసుకువెళ్లిపోయాడు. పాపను ఏదో హోంలో ఉంచాడని తరువాత తెలిసింది.

తను గమనించలేదు గానీ ప్రియ ఇంటికి దూరమయినప్పటి నుంచే విష్ణులో విపరీతమైన మార్పు వచ్చింది.

"వాస్తవానికి విష్ణు మంచితనం వల్లే తన కాపురం నిలబడింది. విష్ణు కూడా తనలాగే సంకుచితంగా ఆలోచించి ఉంటే తన కాపురం ఏనాడో ముక్కలయ్యేది. ప్రియ దగ్గరకు వచ్చేసరికి ఆ మంచితనం తనలో ఎందుకు కరువయ్యింది? తన మనసులో మంచితనం, మమత కొరవడటం వల్లే కదా తనకు తొలిసారి అమ్మను చేసిన ప్రియ పరాయిదిగా అనిపించింది. భర్త అన్నట్టుగా కంటేనే అమ్మ అంటే ఎలా?"

"ఎవరూ అడిగేవాళ్లు లేరనేగా ప్రియకు ఇంత అన్యాయం చేస్తున్నావు" అన్న విష్ణు మాటలు గుర్తొచ్చాయి సిరికి.

"నిజమే! ఓ చిన్నారి జీవితంతో ఆడుకునే అధికారం తనకెక్కడిది? తనకు అవసరం ఉన్నప్పుడు పాపను తీసుకొచ్చుకుని, తీరా పబ్బం గడిచాక వదిలించుకోవాలనుకోవటం వల్ల పసి హృదయం ఎంత తల్లడిల్లిపోయుంటుంది? అసలు పాపను తను తీసుకురాకపోయుంటే శరణాలయం జీవితానికి అలవాటు పడిపోయుండేది. ఇప్పుడు తల్లిప్రేమకు ఎంతగా అలమటిస్తోందో!"

ఇహ స్థిమితంగా ఉండలేక చప్పున విష్ణు దగ్గరకు వెళ్లింది.

బయటకు వెళ్లటానికి ఉద్యుక్తుడవుతున్న విష్ణుని అడిగింది "ప్రియ దగ్గరకా?"

అబద్ధం చెప్పలేక మౌనంగా ఉండిపోయిన అతని వాలకమే చెప్పింది ప్రియ దగ్గరకేనని.

ఇన్ని రోజులుగా భర్త ఎక్కడకి వెళ్తున్నాడోనన్న సందేహం కూడా నివృత్తి అయ్యింది.

"నేనూ వస్తాను. ప్రియను ఇక్కడికే తీసుకొద్దాం. నా కూతురు నా తోనే ఉంటుంది" నేలచూపులు చూస్తూ చెప్పింది.

గుండెలోతుల్లోంచి వచ్చిన సిరి మాటల్లో ప్రియ పట్ల ప్రేమ విష్ణు హృదయాన్ని తాకింది. అంగీకార సూచనగా సిరి చేయిని అందుకున్నాడు.

○